సాక్షి
వైఎస్సార్ జిల్లా

శనివారం । 17 । మే । 2025



పట్టుపట్టి... ర్యాంకులు కొట్టి

తల్లిదండ్రుల కష్టాలను చూసిన విద్యార్థులు తమ లక్ష్యం ఎంచుకున్నారు. ఏపీ ఈసెట్ పరీక్ష ఫలితాల్లో ర్యాంకులు సాధించి భళా అనిపించారు. -IIలో



కనుల పండువగా కల్యాణోత్సవం

జమ్మలమడుగులోని నారాపుర వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం శుక్రవారం కనుల పండువగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, తిలకించి తరించారు. -IIలో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.8/26.7

జిల్లాలో శుక్రవారం 26.7 – 37.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

21న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

కడప సెవెన్‌రోడ్స్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈ నెల 21న నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ ఓబులమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కడప జెడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు ఈ సమావేశాలు ప్రారంభం అవుతాయని ఆమె పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, కడప, అన్నమయ్య జిల్లాల అధికారులు హాజరు కావాలని కోరారు.

నేడు తిరంగ యాత్ర ర్యాలీ

కడప కోటిరెడ్డిసర్కిల్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సైనికులకు మద్దతు తెలియజేస్తూ సిటీజన్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ అనే పేరున శనివారం కడప నగరంలో తిరంగ యాత్ర నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకట సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4.30 గంటలకు కడపలోని ఏడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రవాదుల దాడికి ప్రతి చర్యగా.. ఆపరేషన్ సింధూర్ ద్వారా అద్భుతమైన విజయం అందుకున్న తరుణంలో ఈ యాత్ర నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ర్యాలీలో ప్రతి ఒక్కరూ పాల్గొని త్రివిధ దళాలకు సంఘీభావం తెలియజేయాలని కోరారు.

పశువైద్య కళాశాలకు వీసీఐ బృందం



పశువైద్య కళాశాలలోని విభాగాలను పరిశీలిస్తున్న వీసీఐ పరిశీలకులు

ప్రొద్దుటూరు: మండలంలోని గోపవరం గ్రామ సమీపంలో ఉన్న పశువైద్య కళాశాలను వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (వీసీఐ) బృందం ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు పరిశీలించింది. వీసీఐ పరిశీలకులు డాక్టర్ విజయకుమార్, డాక్టర్ సాహత్పురే కళాశాలలోని వివిధ విభాగాలు, పశు చికిత్సాలయం, పశుగణక్షేత్ర సముదాయాలు, విద్యార్థుల వసతి గృహాలు, క్రీడా విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులతో సమావేశమై వారి అభిప్రాయాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎక్జామినేషన్ డాక్టర్ వి.చెంగల్వరాయులు, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

20న ఉద్యోగమేళా

రాయచోటి టౌన్: రాజంపేట పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఈ నెల 20న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఏ. సురేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో హెడీఎఫ్‌సీ బ్యాంక్, జప్టో, టాటా ఏఐఏ, ఎస్‌బీఐ కార్డ్స్, పేటీఎం, సూపర్ కె, ఏఐఎఎల్ డిక్సన్,ముత్తూట్ ఫైనాన్స్, నియోలైక్, డాయికిన్, యంగ్ ఇండియా వంటి కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొని ఎంపికలు నిర్వహిస్తారని చెప్పారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ పాస్ అయిన అభ్యర్థులు పాల్గొనవచ్చన్నారు. మరిన్ని వివరాల కోసం 88977 76368 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్: ఎస్‌పీకేఎం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ హ్యాండ్లూమ్ టెక్నాలజీలో 2025–26 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ వెంకటగిరి ఓఎస్‌డీ ఎస్.గిరిధర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్ టెక్నాలజీలో సంవత్సరం, మూడు సంవత్సరాల డిప్లొమా కోర్సు, నేరుగా రెండవ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. వెంకటగిరిలో ఎస్‌పీకేఎం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ హ్యాండ్లూమ్ టెక్నాలజీలో 52 సీట్లు, తమిళనాడు సేలంలో 12, కర్ణాటకలోని గదక్‌లో 4 సీట్లు మూడు సంవత్సరాల హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్ టెక్నాలజీ డిప్లొమా కోర్సులో ఉన్నాయని వివరించారు.

అర్హతలు: 10వ తరగతి లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి. జూలై 1 నాటికి బీసీ, జనరల్ కేటగిరీలకు 15–23 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు 25 ఏళ్ల వరకు సడలింపు ఉంటుంది.

లేటరల్ ఎంట్రీ: మూడేళ్ల డీహెచ్ టీటీ కోర్సులో ఇంటర్మీడియెట్ ఎంపీసీ, ఒకేషనల్ (టెక్స్‌టైల్స్), ఐటీఐ (రెండేళ్లు) కోర్సులో ఉత్తీర్ణులైన వారు నేరుగా డీహెచ్‌టీటీ రెండవ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుల కోసం మే, జూన్ మాసాల్లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఐహెచ్‌టీవీజీఆర్.కామ్ వెబ్‌సైట్‌ను పరిశీలించాలి. చివరి తేదీ జూన్ 1వ తేదీగా అభ్యర్థులు గుర్తించాలి. ఇతర వివరాలకు 08625–295003, 93999 36872, 9866169908, 9010243054 ఫోన్ నంబర్లలో సంప్రదించాలి.

అంతా నా ఇష్టం!

- ఎమ్మెల్యే మాధవీరెడ్డి తీరుతో విసిగి పోతున్న తెలుగు తమ్ముళ్లు
- నడిమంత్రపు హోదానే కారణమంటున్న విశ్లేషకులు
- ప్రతి సందర్భంలోనూ కవ్వింపు చర్యలు
- దిగజారుతున్న టీడీపీ ప్రతిష్ట
- ప్రశాంతతకు నిలయమైన కడపలో దుష్ట సంప్రదాయం



మున్సిపల్ కార్పొరేషన్ సమావేశంలో ఆగ్రహంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవీరెడ్డి (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కడప: 'అంతా నా ఇష్టం' అన్నట్లుగా.. కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి వ్యవహరిస్తున్నారు. నిత్యం ఏదో ఓ కారణంతో.. వివాదాలకు కేంద్ర బిందువు అవుతున్నారు. కడప గడపలో మునుపెన్నడూ లేని రీతిలో రాజకీయ దుమారం రేపుతున్నారు. ప్రత్యర్థులపై ప్రతీకారేచ్ఛతో విరుచుకుపడుతున్నారు. అడ్డుగా నిలుస్తున్నారనుకున్న వారందరిపై.. తరతమ భేదం లేకుండా.. అధికారం అడ్డుపెట్టుకొని వేటు వేస్తున్నారు. ఆపై ప్రత్యక్షంగా నోరు పారేసుకుకోవడం కూడా చేస్తున్నారు. నడిమంత్రపు హోదానే దుష్ట సంప్రదాయానికి ప్రధాన కారణమని ఆ పార్టీ సీనియర్లు భావిస్తున్నారు. వ్యక్తిగత ఇమేజ్ ముసుగులో పార్టీ ప్రతిష్టను పాతిపెట్టేస్తున్నారని తెలుగు తమ్ముళ్లు తల పట్టుకుంటున్నారు.

పార్టీ నగర అధ్యక్షుడిపై దాడి



గాయపడిన శివకొండారెడ్డి (ఫైల్)

జిల్లా కేంద్రమైన కడపలో ప్రశాంత వాతావరణం ఉండేది. గడిచిన ముప్పై ఏళ్లుగా ఎలాంటి ఉద్రిక్తత పరిస్థితులు లేవు. కాగా మాధవీరెడ్డి రాజకీయ ఆరంగ్రేటం చేసిన తర్వాత ఉద్రిక్తత వాతావారణం కడప గడపలో ఉత్పన్నమైందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మేయర్ సురేష్‌బాబు ఇంటిపై చెత్త వేయించారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో కొనసాగుతున్న కడప నగర టీడీపీ అధ్యక్షుడు శివకొండారెడ్డిపై ఎమ్మెల్యే అనుచరులు దాడి చేశారు. 'వీపులు విమానం మోత మోగుతాయ'ని మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాధవీ ప్రత్యక్ష బెదిరింపులకు దిగడం.. ఇవన్నీ కూడా టీడీపీ ప్రతిష్టను దిగజార్చనున్నట్లు పలువురు వివరిస్తున్నారు.

టపాసులు పేల్చుతూ కవ్వింపులు

కడపలో తాను చెప్పిందే వేదం అన్నట్లుగా వ్యవహారశైలి కన్పించడంపై ప్రజాస్వామ్యవాదులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అంతే కాదు, మాజీ మంత్రి అంజద్‌బాషా సోదరుడు అహమ్మద్‌బాషా ఓ కేసులో అరెస్టు అయితే, వారి ఇంటికి కూత వేటు దూరంలో ఎమ్మెల్యే అనుచరులు టపాసులు పేల్చడం, మేయర్ సురేష్‌బాబుపై అనర్హత వేటు వేయగానే కార్పొరేషన్ వద్ద టపాసులు పేల్చడం, ఇలాంటి కవ్వింపు చర్యలు మునుపెన్నడూ కడపలో కన్పించడం లేదని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

మేయర్ సురేష్‌బాబుపై కక్ష సాధింపు

కడప మేయర్ సురేష్‌బాబుపై అనర్హత వేటుతో ఎమ్మెల్యే మాధవీరెడ్డి బృందం ఆనందం వ్యక్తం చేస్తోంది. ఈ వ్యవహారంపై ప్రజల్లో తీవ్ర దుమారం రేగుతోంది. రూ.36 లక్షల విలువైన కాంట్రాక్టు పనుల్లో ఎలాంటి అవినీతి జరగలేదని.. ఏకంగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తేల్చి చెప్పినా చర్యలకు ఉపక్రమించడంపై ప్రజల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. ఇక 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న సురేష్‌బాబు.. ముఖ్యమంత్రులుగా పని చేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలకు అత్యంత సన్నిహితులుగా మెలిగారు. కాంట్రాక్టు పనులే కావాలనుకుంటే వందల కోట్ల పనులు చేసి ఉండేవారు కదా? అని విశ్లేషకులు సైతం వెల్లడిస్తున్నారు. రాజకీయంగా అడ్డు నిలుస్తున్నారనే భావనతోనే మేయర్‌పై దొంగదెబ్బ తీశారని పరిశీలకులు పేర్కొంటున్నారు. మేయర్ కుటుంబ సభ్యుల పేరుతో ఉన్న కాంట్రాక్టు సంస్థ పనులు చేయరాదంటూ నిలువరించాల్సిన అధికారులపై చర్యలు తీసుకోకపోగా.. మేయర్‌పై మాత్రమే చర్యలు చేపట్టడం వెనుక కక్ష సాధింపే ప్రధాన కారణమని పరిశీలకులు వెల్లడిస్తున్నారు.

'ఎస్ మేడమ్'.. అనకపోతే ప్రతీకారమే



ఎమ్మెల్యే మాధవీరెడ్డి పార్టీలో అంకితభావంతో పని చేసిన వారి పట్ల అయినా.. సానుకూలతతో ఉన్నారా? అంటే.. అది కూడా కన్పించడం లేదని పలువురు వాపోతున్నారు. ఎస్..మేడమ్ అన్నోళ్లు మినహా తక్కిన వారందరిపై ప్రతీకార చర్యలకు దిగుతున్నారు. అందుకు ప్రత్యక్ష ఉదాహరణ ఆ పార్టీ నుంచి ఎంపికైన ఏకైక కార్పొరేటర్ ఉమాదేవి పట్ల కార్పొరేషన్ సమావేశంలో.. ఎమ్మెల్యే దురుసుగా వ్యవహరించిన తీరును పలువురు ఉదహరిస్తున్నారు. ఇవన్నీ కూడా నడిమంత్రపు హోదా కారణంగా జరుగుతున్నాయని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

నష్టనివారణ చర్యలు ఎలా?



ఎమ్మెల్యే ఏకపక్ష చర్యల కారణంగా టీడీపీ ప్రతిష్ట పూర్తిగా దిగజారిపోయింది. నష్ట నివారణ చర్యలు ఎలా అనే సందిగ్ధంలో ఆ పార్టీ సీనియర్లు పడ్డారు. మునుపెన్నడూ లేని రాజకీయ కక్ష సాధింపు చర్యలు భవిష్యత్తులో ఎలాంటి పరిణామాలకు దారితీస్తాయో అనే ఆవేదనను ఆ పార్టీ నేతలు వ్యక్తం చేస్తున్నారు. పార్టీ అధికారంలో లేని సమయంలో జెండా మోసి కష్టనష్టాలను భరించిన వారి పట్ల కూడా సానుకూలత లేదని పలువురు వాపోతున్నారు. అదే విషయాన్ని బాహాటంగా తెలుగుతమ్ముళ్లు వెల్లడించలేని దుస్థితిలో ఉండటం గమనార్హం. మహానాడు సందర్భంగా రాష్ట్ర ముఖ్యనేతల దృష్టికి కడపలో నెలకొన్న పరిస్థితులపై నివేదికలు ఇవ్వాలనే దిశగా ఆ పార్టీ శ్రేయోభిలాషులు అడుగులు వేస్తున్నట్లు సమాచారం.

రాష్ట్రంలో రాజకీయ కక్ష సాధింపు పాలన

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథరెడ్డి



వల్లూరు: రాష్ట్రంలో రాజకీయ కక్ష సాధింపు పాలన జరుగుతోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి విమర్శించారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని ప్రభుత్వం మునుపెన్నడూ లేని విధంగా.. తప్పుడు సంప్రదాయాలకు తెరతీస్తోందని మండిపడ్డారు. కడపలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు చేస్తున్న కక్ష రాజకీయాల వల్ల రాష్ట్రంలో వ్యవస్థలు దెబ్బతింటున్నాయని అన్నారు. మాజీ ఐఏఎస్‌లు, ఐపీఎస్, ఇతర అధికారులపై సైతం తప్పుడు కేసులు పెట్టి సాక్షాలు, వాంగ్మూలాలు సృష్టించడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. మాజీ ఐఏఎస్ అధికారి ధనుంజయరెడ్డి, మాజీ ప్రభుత్వాధికారి కృష్ణమోహన్‌రెడ్డిల అరెస్టులను ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలు రాష్ట్రానికి చేటుగా మారుతున్నాయని విమర్శించారు. ప్రభుత్వాధికారులు, మాజీ ప్రభుత్వాధికారులపై కూడా రాజకీయ విరోధం చూపించడం తగదన్నారు. చంద్రబాబు తీసుకొచ్చిన తప్పుడు సంప్రదాయాలు రాష్ట్రానికి చేటు చేస్తున్నాయన్నారు. లిక్కర్ వ్యవహారంలో ఇప్పటి వరకూ ఎలాంటి ఆధారాలు చూపలేదని.. కానీ బెదిరించి, భయపెట్టి తప్పుడు వాంగ్మూలాలు తీసుకుని, అరెస్టులు మాత్రం చేస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మద్యం కల్తీ జరుగుతోందని ఆరోపించిన టీడీపీ.. ఇప్పుడు అధికారంలో వుండి అవే డిస్టలరీల నుంచి కొనుగోలు చేస్తుండటం ఆ పార్టీ మోసపూరిత విధానాలకు నిదర్శనమన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఖజానాకు నష్టం వచ్చిందన్న టీడీపీ.. నేడు అధికారంలో వుండి ప్రభుత్వమే విచ్చలవిడిగా మద్యం అమ్ముతున్నా ఆదాయాలు ఎందుకు పెరగడం లేదో చెప్పాలని ప్రశ్నించారు.

ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు

జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

వేంపల్లె: జాతీయ ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. జిల్లాలో జరుగుతున్న ఉపాధి పనుల్లో అవినీతి జరుగుతోందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో శుక్రవారం వేంపల్లె పంచాయతీ పరిధిలోని రాజీవ్ నగర్ కాలనీ సమీపంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను కలెక్టర్ తనిఖీ చేశారు. అలాగే కూలీలతో మాట్లాడి.. పనులు, సౌకర్యాలు, బిల్లుల చెల్లింపుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పథకం కింద ఉద్యానవన పంటలను సాగు చేసిన నిమ్మ, చీనీ పంటలను పరిశీలించి.. రైతుల ద్వారా బిల్లుల చెల్లింపులు, ఇతర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కూలీలు డీకేటీ భూములను సాగు చేసుకుంటుంటే అలాంటి వారికి పట్టాలు ఇస్తామని కలెక్టర్ చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఉపాధి పనులను తనిఖీలు చేపట్టడం జరుగుతుందన్నారు. కలెక్టర్ వెంట పులివెందుల ఆర్డీవో చిన్నయ్య, తహసీల్దార్ హరినాథ్‌రెడ్డి, ఎంపీడీఓ కుళాయమ్మ, ఉపాధి ఏపీఓ పార్వతి, ఉపాధి హామీ పథక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

నాణ్యమైన విద్యనందించండి

ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో చదివే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని కలెక్టర్ శ్రీధర్ ఆదేశించారు. మండలంలోని ఇడుపులపాయ పంచాయతీలో ఉన్న ఆర్జీయూకేటీ పరిధిలోని ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీని ఆయన తనిఖీ చేశారు. అనంతరం ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తాతో కలిసి ఆయా శాఖల అధికారులతో అడ్మినిస్ట్రేషన్‌పై సమావేశం నిర్వహించారు. ఫ్యాకల్టీ, సిబ్బంది తదితర అంశాలపై ఆరా తీశారు. పాలనపరంగా ఉన్న సమస్యలను తమ దృష్టికి తేవాలని డైరెక్టర్‌కు కలెక్టర్ సూచించారు. పరిశ్రమలకు అనుగుణంగా ట్రిపుల్ ఐటీలో కొత్త ల్యాబ్‌లను అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ట్రిపుల్ ఐటీ అధికారులు పాల్గొన్నారు.

గండి ఆలయ నిర్మాణం త్వరగా పూర్తి చేయండి

చక్రాయపేట: ఆలయ నిర్మాణం పనులు రెండు నెలల్లో పూర్తి చేసి గండి వీరాంజనేయ స్వామి మూలవర్ల దర్శనం భక్తులకు కల్పించాలని కలెక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. ఆయన శుక్రవారం గండి క్షేత్రానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ, సహాయ కమిషనర్ వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో ప్రధాన ఉప ప్రధాన, ముఖ్య అర్చకులు కేసరి, రాజారమేష్, రాజగోపాలాచార్యులు, రఘు, వేదపారాయణదారు రామమోహన్‌శర్మలు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయనచే ప్రత్యేకంగా పూజలు చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. శేషవస్త్రం, స్వామి చిత్రపటంతో సత్కరించి ఆశీర్వచనం చేశారు. అనంతరం కలెక్టర్ నిర్మాణంలో ఉన్న ఆలయాన్ని పరిశీలించారు. పనులు ఎంత మేర జరిగాయి, ఎంత జరగాల్సి ఉంది అనే విషయంపై ఏఈ నిఖిల్‌ను అడిగి తెలుసుకున్నారు. శ్రావణ మాసంలోపు కుంభాభిషేకం చేయించాలని చక్రాయపేట, వేంపల్లె జెడ్పీటీసీ సభ్యులు శివప్రసాదరెడ్డి, రవికుమార్‌రెడ్డి, ఎంపీపీ మాదవీ బాలకృష్ణ కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. ఇందుకు స్పందించిన ఆయన రెండు నెలల్లో కుంభాభిషేకం నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా చక్రాయపేటను కరువు మండలంగా ప్రకటించాలని ఎంపీపీ, జెడ్పీటీసీ వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో కడప ఎండోమెంట్ అధికారి మల్లికార్జున ప్రసాద్, పాలక మండలి సభ్యులు చక్రపాణిరెడ్డి, మధు, బిందుసాగర్, జయమ్మ, లలితమ్మ, సుగుణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

- గండి స్వామి దర్శనం అనంతరం కలెక్టర్ చక్రాయపేట తహసీల్దారు కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ ఇన్‌చార్జి తహసీల్దారు హరినాథరెడ్డి, ఎంపీడీవో కుళాయమ్మ ఆర్‌డబ్ల్యూస్ ఎస్ఈ ఏడుకొండలు, ఈఈ విజయభాస్కర్‌రెడ్డి, డీఈ సాలన్న, ఏఈ రమేష్‌రెడ్డితో మండలంలో తాగునీటి ఎద్దడిపై సమీక్షించారు. మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.

వ్యాపారి.. తీరు మారి..

- ఒక్కరోజులో రూ.10 వేల ధర వ్యత్యాసం
- జెడ్పీలో గళమెత్తిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు
- అక్రమాలు కట్టడి చేయాలని కలెక్టర్‌కు విన్నపం
- కలెక్టర్ ఆకస్మిక పర్యటనకు వస్తున్నారని ప్రచారం
- ఒక్కమారుగా పెరిగిన చీనీకాయల రేటు



సాక్షి ప్రతినిధి, కడప: ప్రకృతికి దీటుగా ఎదురొడ్డి నిలబడ్డారు. కష్టానికి వెరవక కన్నబిడ్డల లెక్కన చెట్లను పెంచుకున్నారు. అందుకు తగ్గట్టుగా పంట దిగుబడి లభించింది. ఎంతో సంతోషించిన రైతన్నలు.. చివరికి మార్కెట్ మాయాజాలంలో చిక్కుకున్నారు. పెట్టుబడులకు తగ్గ గిట్టుబాటు ధర లభించడం లేదు. శ్రమంతా వృథా అవుతోంది. ఏమి పాలుపోలేని స్థితికి చేరుకోవడంతో.. కొందరు ఏకంగా చెట్లను పెకలిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో ధరలు లేవా అంటే.. భారీగా పలుకుతున్నాయి. రైతులు విక్రయాల వద్దకు తీసుకువచ్చే సమయంలో గణనీయంగా తగ్గుతున్నాయి. చీనీ రైతుల పరిస్థితిపై స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు జెడ్పీలో గళమిప్పారు. 24 గంటల వ్యవధిలో భారీగా మార్పు లభించింది.

వ్యాపారులు సిండికేట్‌గా మారి..

పులివెందుల మార్కెట్ యార్డులో చీనీకాయల విక్రయాల కేంద్రం ఏర్పాటు చేశారు. ఎంతో ఉపయోగకరంగా మారిన ఈ కేంద్రంలో.. ఇటీవల వ్యాపారులు సిండికేట్ అయ్యారు. కొందరు దళారుల అవతారమెత్తి దోచుకుంటున్నారు. మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించింది. కొందరు స్థానిక అధికారులు వ్యాపారులకు దాసోహం అయ్యారు. పొరుగు జిల్లాలో అధికంగా ఉన్న ధరలు.. వైఎస్సార్ జిల్లాలో లభించడం లేదు. గురువారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఈ విషయమై స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు గళమెత్తారు. రైతులను దోచుకుంటున్నారని వాపోయారు. వీరపునాయునిపల్లె ఎంపీపీ రఘునాథరెడ్డి, వేంపల్లె, వేముల జెడ్పీటీసీలు రవికుమార్‌రెడ్డి, బయపురెడ్డి తదితరులు సభ దృష్టికి తీసుకెళ్లారు. 'కలెక్టర్ సార్ చొరవ తీసుకోండి.. దళారులను కట్టడి చేయండి, వ్యాపారులను అనుమతించండి. పొరుగునే ఉన్న అనంతపురంలో ఉన్న ధరలు పులివెందులలో లేవు' అని ఏకరువు పెట్టారు.

టన్నుకు రూ.10 వేలు అదనంగా పలికిన ధర

మార్కెట్ యార్డులో వ్యవహరిస్తున్న ధోరణి జెడ్పీ సమావేశంలో బహిర్గతం కావడం, ప్రధాన నగరాల్లో ఉన్న ధరలు డిజిటల్ బోర్డు ద్వారా డిస్‌ప్లే చేస్తామని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ప్రకటించడం, పులివెందుల వ్యవహారంలో సమీక్ష చేస్తామని ప్రకటించడంతో మార్కెటింగ్‌శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. దీంతో 24 గంటలు గడవక మునుపే టన్నుపై రూ.10 వేల ధర అదనంగా పెరిగింది. బుధ, గురువారాల్లో రూ.31 వేలు, రూ.32 వేలు ఉన్న ధర శుక్రవారం టన్ను చీనీ కాయలు రూ.41,500 కొనుగోలు చేశారు. మే 1న రూ.21 వేలు మాత్రమే పలికాయి. మే 8న రూ.22 వేల ధర ఉంది. మే 16 నాటికి రూ.41,500 పలికాయి. ఈ వ్యత్యాసంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. శుక్రవారం పులివెందుల మార్కెట్‌లో 44.08 టన్నుల చీనీకాయలు విక్రయాలు జరిగాయి. గడిచిన రెండు వారాల్లో 1090 టన్నుల చీనీ కాయలు విక్రయించారు. దాదాపు 1050 టన్నులను సగం ధరకే రైతుల నుంచి వ్యాపారులు కొనుగోలు చేశారు. కోట్లాది రూపాయలు మార్కెటింగ్ మాయజాలంతో రైతులు కోల్పోయారని పలువురు వాపోతున్నారు.

కలెక్టర్ వస్తున్నారని ప్రచారం...

జిల్లా కలెక్టర్ శుక్రవారం వేంపల్లె, గండి ప్రాంతాల్లో పర్యటించారు. పులివెందుల మార్కెట్‌లో కూడా పర్యటిస్తారనే ప్రచారం జరిగింది. దీంతో మార్కెటింగ్ అధికారులు అప్రమత్తమయ్యారు. వ్యాపారులను హెచ్చరించారు. ఒక్కరోజులో టన్నుకు రూ.10 వేల ధర అదనంగా పెరిగింది. కార్యాలయానికి పరిమితం కాకుండా కలెక్టర్ జిల్లాలో పర్యటిస్తే ఎలాంటి ప్రయోజనాలు దక్కుతాయో.. దీనిని బట్టి ఇట్టే అర్థం చేసుకోవచ్చునని పరిశీలకులు వెల్లడిస్తున్నారు.

పర్యవేక్షణ కొరవడింది



చీనీ కాయల విక్రయాల కొనుగోలు కేంద్రంలో మార్కెటింగ్ శాఖ పర్యవేక్షణ కొరవడింది. ఉన్నతాధికారులు సమీక్ష చేస్తూ ఇతర ప్రాంతాల్లోని మార్కెట్లలో లభిస్తున్న ధరల వ్యత్యాసాన్ని గమనించాలి. రైతులకు అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉంది. ఒక్క రోజులో టన్నుకు రూ.10 వేలు అదనంగా ధర పలికింది. ఇంతకాలం వడపు కాయలంటూ రకరకాల కొర్రిలు పెట్టి దోచుకున్నారు. శుక్రవారం మండీలో ఉన్న కాయలన్నీ కొనుగోలు చేశారు.

–ఎంపీపీ రఘునాథరెడ్డి, వీరపునాయునిపల్లె

కలెక్టర్ చొరవ అభినందనీయం



జిల్లా పరిషత్ సమావేశంలో సభ్యులు చీనీ రైతుల దుస్థితిని వివరించారు. ఆకస్మిక పర్యటన పెట్టుకొని పరిశీలించాలని కలెక్టర్‌ను అభ్యర్థించాం. తక్షణమే స్పందించి ఆయన మార్కెట్‌లో ప్రధాన నగరాల్లో ఉన్న ధరలు డిస్‌ప్లే అయ్యేలా బోర్డులు కూడా ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. కలెక్టర్ సమీక్ష వల్లే మార్కెట్ ధరల్లో ఒక్కమారుగా మార్పు వచ్చింది. చీనీ రైతుల దుస్థితిపై స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల ఆవేదనపై కలెక్టర్ చొరవ అభినందనీయం.

– ముత్యాల రామగోవిందురెడ్డి, జెడ్పీ చైర్మన్

పులివెందుల మార్కెట్ యార్డులో చీనీ కాయల ధరలు

తేదీ	అమ్మకం జరిగిన సరుకు పరిమాణం (టన్నులలో)	మార్కెట్‌యార్డులో టన్ను ధర (రూ.లలో)
మే 1	54.72	21,600
2	84.43	21.100
3	65.45	18,100
5	163.43	31,000
6	142.18	22,000
7	75.79	23,200
8	72.41	22,000
9	53.88	26,700
10	40.71	21,500
12	72.19	26,700
13	62.44	26,000
14	68.37	31,000
15	90.28	32,100
16	44.08	42,500
మొత్తం: 1090.36 టన్నులు		

గళమిప్పితే ప్రయోజనమే

ఎంపీపీ రఘునాథరెడ్డి, జెడ్పీటీసీలు రవికుమార్‌రెడ్డి, బయపురెడ్డి తదితరులు మార్కెటింగ్‌శాఖ పరిధిలో చోటుచేసుకున్న అక్రమాలు, రైతులు నష్టపోతున్న తీరుపై వాస్తవిక విషయాలను సభ దృష్టికి తీసుకొస్తే.. అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరాలి. అలా కాకుండా దళారులంతా స్థానిక ప్రజాప్రతినిధుల వర్గీయులే కదా అంటూ సీనియర్ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి వ్యాఖ్యానించి జెడ్పీ సభలో అభాసుపాలైయ్యారు. రైతుల సమస్యల పట్ల చిత్తశుద్ధి ప్రదర్శించపోగా, అక్కడ కూడా రాజకీయం దృక్పథంతో వ్యవహరించడం నవ్వులపాలు కావాల్సి వచ్చిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

క్లుప్తంగా

చెట్టును ఢీకొన్న లారీ

అట్లూరు : మండలంలోని కడప–బద్వేల్ రహదారిపై కలివికోడి పరిశోధనా కేంద్రం సమీపంలో ఓ లారీ అదుపు తప్పి చెట్టును ఢీకొంది. స్థానికుల వివరాల మేరకు.. గురువారం రాత్రి కడప వైపు నుంచి వెళ్తున్న లారీ అట్లూరు పోలీస్ స్టేషన్ సమీపం లోని కలివికోడి పరిశోధనా కేంద్రం వద్దకు చేరగానే.. అదుపు తప్పి రోడ్డుకు ఆవల ఉన్న వేప చెట్టును ఢీకొంది. రాత్రి సమయంలో వాహనాలు రాకపోవడంతో డ్రైవర్‌కు పెను ప్రమాదం తప్పింది. మద్యం మత్తులో లారీ నడిపినట్లు స్థానికులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



తీవ్రంగా గాయపడిన సుధీర్, మహేష్

బద్వేలు అర్బన్ : నెల్లూరు జిల్లా కదిరినాయుడుపల్లె సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు బద్వేల్ వాసులకు తీవ్రగాయాలయ్యాయి. మున్సిపాలిటీ పరిధిలోని వల్లెరవారిపల్లెకు చెందిన సుధీర్, బ్రాహ్మణ వీధికి చెందిన మహేష్ పిపి.కుంట సమీపంలోని సెంచరీ పానెల్స్ పరిశ్రమలో పనిచేస్తున్నారు. శుక్రవారం ఓ పని నిమిత్తం తమ స్కూటీలో నెల్లూరుకు వెళ్లి తిరిగి వస్తుండగా కదిరినాయుడుపల్లె సమీపంలోని వంతెన వద్ద అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు కడప రిమ్స్‌కు తరలించారు.

కోర్టు సముదాయంలో భద్రతపై సెక్యూరిటీ ఆడిట్



కడప కోర్టును పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

కడప అర్బన్ : కడప నగరంలోని జిల్లా కోర్టు సముదాయంలో భద్రతా చర్యలపై స్టేట్ ఇంటిలిజెన్స్, పోలీస్, అగ్నిమాపక అధికారులు సెక్యూరిటీ ఆడిట్ నిర్వహించారు. భవన సముదాయంలో ఎలాంటి పరిస్థితులనైనా దీటుగా ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. సీసీ కెమేరాలు, ఫైర్ సేఫ్టీ, ఇతర చర్యల నిమిత్తం కోర్టు ఆవరణంతా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇంటిలిజెన్స్ డీఎస్పీ వై.సాయిరాం, స్టేట్ టెక్నికల్ సర్వీసెస్ సీఐ సుదర్శన్‌రెడ్డి, కడప డీఎస్పీ పి.వెంకటేశ్వర్లు, ఎస్.వినయ్‌కుమార్‌రెడ్డి, ఆర్.పురుషోత్తం రాజు, బసివిరెడ్డి, జీవన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



ఇంటిని కదపక.. చెట్టును తీయక

మనిషిని కాపాడుకుందాం...కానీ ఓ చెట్టును కాపాడుకునే ప్రయత్నం చేయం. కానీ ఈ ఇంటిలోని వ్యక్తులు పర్యావరణాన్ని కాపాడుకునేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇంటిలోనుంచి చెట్టు ఎటు వెళ్లినా దాన్ని కాపాడుకునేందుకు కృషి చేస్తున్నారు. ఎన్ని వంపులు తిరిగినా చెట్టును ధనంగా భావించి నిలుపుకుంటున్నారు. కడప నగరం నాగరాజుపేట గుండాచారి హైస్కూల్ వద్ద ఓ ఇంట్లో కనిపించిన దృశ్యాలు సాక్షి కెమేరాకు చిక్కాయి. – ఫొటోగ్రాఫర్, సాక్షి, కడప



ఇద్దరు ఏఆర్ కానిస్టేబుళ్ల సస్పెన్షన్

- ఓ యువతి ఆత్మహత్య కేసులో నిందితుడిగా భావిస్తూ ఒకరు
- అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలపై మరొకరు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : కడప ఏఆర్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లపై పోలీసు అధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. యువతుల ఫొటోలు తీసి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడడిప ఒకరిపి. డబ్బు వసూళ్లు, అవినీతి ఆరోపణల నేపథ్యంలో మరొకరిపై విచారించిన ఆ శాఖ ఉన్నతాధికారులు ఇద్దరిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. వివరాల మేరకు.. అన్నమయ్య జిల్లా మన్నూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో గత ఫిబ్రవరిలో ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. కడప ఏఆర్ విభాగం డాగ్ స్క్వాడ్ విభాగంలో పనిచేస్తున్న కానిస్టేబుల్ రామ్మోహన్‌రెడ్డి బంధువు అనిల్‌కుమార్‌రెడ్డి కడప నగర శివారులోని పాలకొండలు, ఇతర శివారు ప్రాంతాల్లో ఎవరైనా యువతీ, యువకులు ఒంటరిగా కనిపించినా వారి ఫొటోలు తీయడం, బ్లాక్‌మెయిల్‌కు పాల్పడడం చేస్తున్నారు. అనిల్‌కుమార్‌రెడ్డి ఫొటోలు తీయడం, ఆయన బంధువైన ఏఆర్ కానిస్టేబుల్ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని బాధితులను బెదిరించి డబ్బు వసూలు చేయడం రోజువారీ కార్యక్రమంగా మారింది. ఈ నేపథ్యంలోనే రాజంపేటలోని ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థిని కడప పాలకొండలుకు స్నేహితులతో పాటు విహారానికి వచ్చింది. ఆ సమయంలో అనిల్‌కుమార్‌రెడ్డి యువతి ఫొటోలు తీసి బెదిరించారు. రోజుల తరబడి వేధింపులకు గురిచేయడంతో తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడింది. ఇదిలా ఉంటే యువతి ప్రవర్తనపై తల్లిదండ్రులకు నేరుగా ఫోన్ చేసి అనిల్‌కుమార్‌రెడ్డి దొరికిపోయాడు. యువతి తండ్రి పోలీసులకు ఫిర్యాదు ఫిర్యాదుచేయడంతో అనిల్‌కుమార్‌రెడ్డి అరెస్టు చేసి విచారించారు. అనంతరం ఏఆర్ కానిస్టేబుల్ రామోహన్‌రెడ్డి ప్రమేయం వుండడంతో అతడిని నిందితుడిగా చేర్చి అరెస్ట్ చేశారు.

అవినీతికి పాల్పడడంతో మరొకరిని...

కడప ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సిద్ధారెడ్డి ట్రావెల్స్ నడుపుతున్నారు. చేపల చెరువు నిర్వహిస్తున్నారు. దీంతోపాటు పోలీస్ కానిస్టేబుల్ ఎంపికల్లో ఈయన అవినీతికి పాల్పడినట్లు తెలిసింది. దీంతో ఉన్నతాధికారులు విచారించి సిద్ధారెడ్డిని సస్పెండ్ చేశారు.

ఉత్సవమూర్తులకు చక్రస్నానం



కుందూనదిలో చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

రాజుపాళెం : మండలంలోని వెల్లాల క్షేత్రంలో జరుగుతున్న బ్రహోత్సవాలలో భాగంగా తొమ్మిదో రోజున శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ, సంజీవరాయ స్వాముల విగ్రహాలను హంస వాహనంపై కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వసంతం చల్లుతూ, భజన పాటలు పాడుతూ, నవ ధాన్యాల మొలకలు తీసుకొని కుందూనదికి చేరుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఉత్సవ విగ్రహాలకు స్నపనం గావించి చక్రస్నానం చేయించారు. అనంతరం అక్కడకు వచ్చిన భక్తులంతా కుందూ నదిలో స్నానం ఆచరించారు. భక్తులకు వేద పండితులు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈఓ వెంకటరమణ, లక్ష్మినారాయణరెడ్డి, రామ్మోహన్, అర్చకులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులపై కేసు నమోదు

కొండాపురం : మండలంలోని పొట్టిపాడు గ్రామానికి చెందిన సింగంశెట్టి సూర్యనారాయణ అలియాజ్ పెద్దసూరి లైంగిక వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. పొట్టిపాడు గ్రామానికి చెందిన సింగంశెట్టి సూర్యనారాయణ స్థానిక మహిళతో అసభ్యంగా మాట్లాడుతూ లైంగికంగా వేధిస్తున్నారు. ఈ విషయం ఆమె తన భర్తకు చెప్పడంతో అతడు వెళ్లి సూర్యనారాయణను మందలించాడు. దీంతో అతడు, ఆయన బంధువుతాను, తన భర్తపై దాడికి యత్నించారని సదరు మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చంటి హత్య కేసులో నిందితుల అరెస్టు



నిందితులతో సీఐ ఉలసయ్య, ఎస్సై చంద్రశేఖర్‌లు

చక్రాయపేట : మండలంలోని సురభి గ్రామం కోమటిపేటకు చెందిన కందుల చంటి హత్య కేసులో నిందితులను శుక్రవారం అరెస్టు చేసినట్లు ఆర్కే వ్యాలీ సీఐ ఉలసయ్య, చక్రాయపేట ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. వివాహేతర సంబంధమే హత్యకు కారణమని ఆయన తెలిపారు. ఈ కేసులో నిందితులైన రెడ్డివారిపల్లె మాలపల్లెకు చెందిన దాసరి వెంకటరమణకుమార్ అలియాస్ రమణకుమార్, జల్ది దర్శనమ్మ, రెడ్డివారిపల్లెకు చెందిన సురభి ఈశ్వరయ్యలను బాలతిమమయ్యగారిపల్లె క్రాస్ వద్ద అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు పంపినట్లు వారు తెలిపారు

ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడిగా లక్ష్మీప్రసాద్

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా ఏపీజీఈఏ (ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం) అధ్యక్షుడిగా రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి డాక్టర్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు ఆయన తెలిపారు. ఈ ఎన్నికకు కడప జిల్లా అధ్యక్షుడు రఘురాంనాయుడు, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కృష్ణ ప్రసాద్ ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. ఈ ఎన్నికలు బుధవారం నిర్వహించగా రాష్ట్ర అధ్యక్షుడి నుంచి అధికారకంగా శుక్రవారం వెలువడ్డాయి.

పార్టీ అధ్యక్షుడిని కలిస్తే.. రాజీనామా చేస్తారా!

- అవిశ్వాసం అన్నప్పుడే వైఎస్ జగన్, అవినాష్‌రెడ్డి గుర్తుకొచ్చారా?
- మున్సిపల్ ఛైర్మన్‌పై మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఆగ్రహం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

మైదుకూరు : మున్సిపల్ కౌన్సిలర్లతో కలిసి తమ పార్టీ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలవడంతో.. మనస్థాపంతో వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేస్తున్నట్టు మున్సిపల్ ఛైర్మన్ మాచనూరు చంద్ర చెప్పడం దురదృష్టకరమని మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ మైదుకూరు మున్సిపల్ ఛైర్మన్ రాజీనామా ప్రకటనపై ఆయన స్పందిస్తూ సొంత పార్టీ అధ్యక్షున్ని కలవడం నేరం కాదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మున్సిపల్ ఛైర్మన్ చంద్ర వైఎస్సార్‌సీపీ కార్యక్రమాల్లో పాల్గొనలేదని, తన వద్దకు, కార్యాలయానికి రాలేదన్నారు. టీడీపీ, జనసేన పార్టీలోకి వెళ్దామని చెబుతున్నారని కౌన్సిలర్లు కొందరు తన దృష్టికి తెచ్చినట్టు పేర్కొన్నారు. రెండు నెలల కిందట మున్సిపల్ ఛైర్మన్‌పై టీడీపీ అవిశ్వాస తీర్మానం పెట్టాలని ప్రయత్నం చేస్తున్నట్టు తెలియడంతో కౌన్సిలర్లు ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డిని కలిసి విషయం తెలిపారన్నారు. అందరూ కలిసికట్టుగా ఉండాలని ఎంపీతోపాటు, తానూ కౌన్సిలర్లకు చెప్పామన్నారు. కౌన్సిలర్ల కోరిక మేరకు తాను మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలిసినట్లు రఘురామిరెడ్డి వివరించారు. మూడు నెలలుగా అడుగుతున్నా జగన్ వద్దకు తనను తీసుకెళ్లలేదని ఛైర్మన్ చెప్పడం అవాస్తవమని అన్నారు. ప్రొటోకాల్ ప్రకారం ఛైర్మన్ నేరుగా కలవవచ్చని పేర్కొన్నారు. టీడీపీ అవిశ్వాసం పెట్టాలనుకున్నప్పుడే మున్సిపల్ ఛైర్మన్‌కు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి గుర్తుకొచ్చారా అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ బీఫారం ఇచ్చి కౌన్సిలర్లను గెలిపించిందని, వారు పార్టీకే విధేయులని అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ మహబూబ్‌షరీఫ్, భరత్‌కుమార్‌రెడ్డి, వెంకటసుబ్బన్న, పిల్లి నాగయ్య, ఏసీకే.వెంకటరమణ, కో ఆప్షన్ సభ్యులు ఎంఆర్ఎఫ్.సుబ్బయ్య, ట్రాక్టర్ గౌస్, వార్డు ఇన్‌చార్జులు జిలాన్, భూమిరెడ్డి సుబ్బరాయుడు, ఖాదర్, కేపీ.లింగన్న, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

ఈ బదిలీలు మాకొద్దు..!

పీఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : ఆహ్లాదకర వాతావరణంలో పని చేసే విధంగా కాకుండా శిక్షించే విధంగా ఉన్న బదిలీలు తమకు అవసరం లేదని ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీ.సుబ్బారెడ్డి, ఎన్‌వీ.సుబ్బారెడ్డి పేర్కొన్నారు. విలేకరులతో వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తి, తొమ్మిది రకాల బడులు అన్నది దేనికి సంకేతమో చెప్పాలన్నారు. గత ప్రభుత్వం సబ్జెక్టులను ఎంచుకుని బోధనకు నియమిస్తే.. కూటమి ప్రభుత్వం వాళ్లందరినీ డిమోషన్ చేసి ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్లుగా నియమించడం సమంజసం కాదన్నారు. రకరకాల పేర్లతో స్కూల్ అసిస్టెంట్లను నియమించడం, క్లస్టర్ ఉపాధ్యాయులు సెలవు పెడితే ఆ పాఠశాలకు వెళ్లడమనేది గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. రేషనలైజేషన్ జీవో 21ను రద్దుచేసి 1:40 ఉండే విధంగా కొత్త జీవో ఇవ్వాలని డిమాండ్ చేశారు.

13 మంది తహసీల్దార్లకు షోకాజ్ నోటీసులు

కడప సెవెన్‌రోడ్స్ : అసైన్డ్ భూముల ఫ్రీ హోల్డ్ విషయంలో నిబంధనలు అతిక్రమించారని జిల్లాలోని 13 మంది తహసీల్దార్లకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. గతంలో 20ఏళ్ల కాలపరిమితితో అసైన్డ్ భూములపై రైతులకు యాజమాన్య హక్కులు కలిప్తూ చట్ట సవరణలు చేసిన విషయం తెలిసిందే. అసైన్డ్ భూములను ఫ్రీ హోల్డ్ చేయడంలో అవకతవకలు చోటుచేసుకున్నాయనే ఆరోపణలు రావడంతో జిల్లా రెవెన్యూ యంత్రాంగం విచారించింది. అప్పట్లో ఆయా మండలాల్లో పనిచేసిన తహసీల్దార్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అప్పట్లో తహసీల్దార్లుగా పనిచేసిన అనూరాధ(మైదుకూరు), వి.గంగయ్య(పోరుమామిళ్ల) మధుసూదన్‌రెడ్డి(బద్వేల్), విజయకుమారి(వీఎన్‌పల్లె), లక్ష్మీనారాయణ(లింగాల), మహబూబ్ బాషా(సింహాద్రిపురం), గురప్ప(జమ్మలమడుగు), ఉదయభాస్కర్‌రాజు(పెండ్లిమర్రి), సువర్ణ(బి.మఠం), సరస్వతి(కమలాపురం) రామచంద్రుడు(కాశినాయన), వెంకటసుబ్బయ్య(వేముల), శంకర్‌రావు(వల్లూరు)లు షోకాజ్ నోటీసులు అందుకున్న వారిలో ఉన్నారు. ప్రధానంగా మైదుకూరు, లింగాల, బి.మఠం, జమ్మలమడుగు మండలాల్లో భారీగా అవకతవకలు జరిగినట్లు తెలిసింది.

8వ సెమిస్టర్ పరీక్షా ఫలితాల విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ విశ్వనాథకుమార్, తదితరులు

కడప ఎడ్యుకేషన్ : 8వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య జి.విశ్వనాథకుమార్ శుక్రవారం విడుదల చేశారు. 66 శాతం బాలురు, 34 శాతం బాలికలు ఉత్తీర్ణత సాధించారు. ఫైన్ ఆర్ట్స్, ప్లానింగ్ విభాగాల్లో 84 శాతం విద్యార్థులు ప్రథమ, 16 శాతం మంది ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. తక్కువ సమయంలో ఫలితాల విడుదలకు కృషి చేసిన సిబ్బందిని వీసీ అభినందించారు. కార్యక్రమంలో వర్సిటీ అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ జి.ఫణీంద్రరెడ్డి, సహాయ పరీక్షల నియంత్రణాధికారి ఉదయప్రకాష్ రెడ్డి, నారపరెడ్డి, వి.శివకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు



గాయపడిన షేక్ ఇమ్రాన్, రెడ్డిబాషా

నిమ్మనపల్లె : రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం ఎగువ కురవంకలో నివాసముంటున్న షేక్ రెడ్డిబాషా శుక్రవారం తన కుటుంబసభ్యులతో కలిసి నిమ్మనపల్లెలోని సయ్యద్ షావలి దర్గా వద్ద జరిగే ఉరుసు చూసేందుకు వెళ్లాడు. అక్కడి నుంచి సింగంవారిపల్లెకు వెళ్లేందుకు చిన్నళ్లవారిపల్లెకు చెందిన పఠాన్ ముస్తఫా ఆటో బాడుగకు మాట్లాడుకుని కుటుంబసభ్యులతో బయలుదేరారు. మార్గమధ్యంలో సైదాపేట మలుపు వద్ద కందూరు వైపు నుంచి వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు వీరు ప్రయాణిస్తున్న ఆటోను ఢీకొంది. ప్రమాదంలో రెడ్డిబాషా(46), తాజున్‌బీ(40), ఇమ్రాన్(17), అసిఫా(14)తోపాటు ఆటో డ్రైవర్ ముస్తఫా(60)లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు బాధితులను నిమ్మనపల్లె పీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మదనపల్లి ఆసుపత్రికి తరలించారు. స్థానిక పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

కన్నుల పండువగా కల్యాణోత్సవం



వేద మంత్రాల మధ్య స్వామి వారి కల్యాణం

జమ్మలమడుగు : నారాపుర వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం శుక్రవారం కన్నుల పండువగా జరిగింది. ఉదయం స్వామి సర్వభూపాల అలంకారంలో పల్లకిపై భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు చెక్కభజన చేస్తూ స్వామికి స్వాగతం పలికారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని కల్యాణ వేదికపై భూదేవి, శ్రీదేవి సమేతంగా నారాపుర స్వామిని కొలువు దీర్చి వేద మంత్రాల మధ్య శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. శనివారం ఉదయం రథోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

పోలీసుల అదుపులో ఇద్దరు ఆఫ్ఘన్లు

కడప అర్బన్ : ఇద్దరు ఆఫ్ఘనిస్తాన్ దేశస్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కడప నగరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజీవ్ పార్కు సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున రెండు గంటల సమయంలో పోలీసులు తనిఖీలు చేశారు. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారించగా ఆఫ్ఘనిస్తాన్ దేశానికి చెందిన అసదుల్లా, ఓవాస్ అని గుర్తించారు. భారతదేశానికి వచ్చి ఐదు సంవత్సరాలు అవుతోంది. నంద్యాలలో కొంతకాలం ఉన్నారు. రెండు నెలల కిందట కడపకు వచ్చారు. ఈ క్రమంలోనే కడపలో ఐస్‌క్రీమ్ పార్లర్‌లో పనిచేస్తూ అక్రమంగా తలదాచుకుంటున్నారు. పోలీసులు ఎంబీసీకి రిపోర్టు పంపనున్నారు. తర్వాత వారి దేశానికి తరలించనున్నట్లు సమాచారం.

వాహనం బోల్తా.. ఒకరి మృతి



మృతి చెందిన చాంద్‌బాషా

తాడిపత్రి : మండలంలోని ఇగుడూరు గ్రామం వద్ద బొలెరో లగేజీ వాహనం బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతిచెందారు. మరో ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన కొందరు కర్ణాటక ప్రాంతంలో కొనుగోలు చేసిన జీవాలను బొలెరో లగేజీ వాహనంలో ఎక్కించుకుని తిరుగుప్రయాణమయ్యారు. శుక్రవారం ఇగుడూరు గ్రామం వద్దకు చేరుకోగానే టైర్ పేలడంతో వాహనం అదుపు తప్పి రహదారిపై బోల్తాపడింది. ఘటనలో ప్రొద్దుటూరుకు చెందిన చాంద్‌బాషా (45) అక్కడికక్కడే మృతి చెందాడు. షేక్ హుస్సేన్ బాషా, ఎర్రగుంట్లకు చెందిన ఆంజనేయులు, గంగప్రతాప్ గాయపడ్డారు. ఘటనపై రూరల్ పీఎస్ సీఐ శివగంగాధరరెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కోడి కత్తితో అన్న, వదినపై దాడి

నిమ్మనపల్లె : అన్నదమ్ముల మధ్య వ్యక్తిగత కక్షలు కత్తులతో దాడి చేసుకునే వరకూ దారి తీశాయి. మాటామాటా పెరిగి క్షణికావేశంలో కోడి కత్తితో సొంత తమ్ముడే.. అన్నా, వదినలపై దాడికి దిగారు. తీవ్రగాయాలతో వారు ఆస్పత్రి పాలయ్యారు. బాధితుల వివరాల మేరకు.. చిత్తూరు జిల్లా చౌడేపల్లి మండలం బోయకొండ పంచాయితీ యానాది కాలనీకి చెందిన ఎర్రప్ప(30), శ్యామల(24) నిమ్మనపల్లె మండలం బండ్లపై పంచాయతీ దుర్గంవారిపల్లె వద్ద వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఎర్రప్పకు గత కొద్ది రోజులుగా తమ్ముడు హనుమంతుతో వ్యక్తిగత వివాదాలున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం ఎర్రప్ప తన భార్య శ్యామలతో కలిసి సొంత పనులపై బండ్లపై గ్రామానికి వచ్చారు. తిరిగి రాత్రి సుమారు ఎనిమిది గంటల సమయంలో దుర్గంవారిపల్లె పొలం వద్దకు వెళ్తున్నారు. తన అన్న వచ్చిన విషయం తెలుసుకున్న ఎర్రప్ప తమ్ముడు హనుమంతు, తన స్నేహితుడు అశోక్, మరో వ్యక్తితో కలిసి అడ్డగించి కోడి కత్తులతో అన్నా, వదినలపై విచక్షణా రహితంగా దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పట్టుపట్టి.. ర్యాంకులు కొట్టి

ఏపీ ఈసెట్‌లో విద్యార్థుల ప్రతిభ

కడప ఎడ్యుకేషన్ : తల్లిదండ్రుల కష్టాలను చూసిన విద్యార్థులు తమ లక్ష్యం ఎంచుకున్నారు. కష్టపడి చదివి తమ కలలు సాకారం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. ఏపీ ఈసెట్ పరీక్ష ఫలితాలు గురువారం వెలువడగా జిల్లా విద్యార్థులు ర్యాంకులు సాధించి భళా అనిపించారు. ఇంజినీరింగ్ చదివి తల్లిదండ్రుల కష్టం తీరుస్తామని చెబుతున్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలని..



తొండూరు మండలం క్రిష్ణంగారిపల్లెకు చెందిన సురేష్‌రెడ్డి కుమార్తె పల్లెటి రాజశ్రీ ఏపీ ఈసెట్‌లో ఐదో ర్యాంకు సాధించారు. ఈమె తండ్రి పులివెందుల మెడికల్ కళాశాలలో ఆరోగ్యమిత్రగా పనిచేస్తుండగా, తల్లి అంగన్‌వాడీ టీచర్‌గా ఉంది. రాజశ్రీ ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు పలివెందులలో చదివారు. పులివెందుల లయోలా కళాశాలలో పాలిటెక్నిక్ సీఎస్‌సీ పూర్తి చేశారు. ఈసెట్ రాసి ఐదో ర్యాంకు సాధించారు. మంచి కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సంపాదించడమే తన లక్ష్యమని విద్యార్థిని తెలిపారు.

రైతు కుమారుడు చదువులో మెరిసె..



ఖాజీపేట కొటంగురువారిపల్లెకు చెందిన మారుతి శ్రీనివాసులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈయన సతీమణి నాగలక్ష్మికళ ప్రైవేట్ టీచర్‌గా పనిచేస్తున్నారు. వీరి కుమారుడు తరుణ్ ఏపీ ఈసెట్‌లో రాష్ట్రస్థాయిలో ఆరో ర్యాంకు సాధించాడు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించిన తరుణ్ కష్టపడి చదివాడు. తిరుపతి ఎస్వీ కాలేజీలో డీఫార్మసీ పూర్తి చేశారు. ఏపీ ఈసెట్‌లో ఆరో ర్యాంకు సాధించారు. కొలువు సాధించమే లక్ష్యం అని చెబుతున్నారు.

తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించా..



తమ తల్లితండ్రులు పడుతున్న కష్టాన్ని కళ్లారా చూసిన గణేష్ కష్టపడి చదివి ఏపీ ఈసెట్‌లో రాష్ట్ర స్థాయిలో ఆరో ర్యాంకు సాధించాడు. వేంపల్లి మండలం ముత్తకూరు గ్రామానికి చెందిన గంగరాజు, గంగాభవానీలు వ్యవసాయం చేస్తూ కుమారుడిని చదివించారు. గణేష్ పులివెందుల లయోలా పాలిటెక్నిక్ కళాశాలలో మైనింగ్‌పూర్తి చేశాడు. తల్లిదండ్రుల కష్టాలు తీర్చాలని చదివి ఏపీ ఈసెట్ రాశారు. ఆరో ర్యాంకు సాధించి భళా అనిపించాడు. మంచి కొలువు సాధించి తల్లిదండ్రుల కష్టాన్ని తీర్చాలన్నదే తన లక్ష్యమన్నారు.

బేల్దారి కుమారుడు ర్యాంకు సాధించాడు



జమ్మలమడుగు మండలం పెద్దగండ్లూరుకు చెందిన చెన్నారెడ్డి బేల్దారి పని చేస్తున్నారు. తల్లి శివపార్వతి గృహిణి. వీరి కుమారుడు గువ్వల జయచంద్రారెడ్డి రాష్ట్ర స్థాయిలో పదో ర్యాంకు సాధించాడు. చిన్నప్పటి నుంచి తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉంటున్న జయచంద్రారెడ్డి వారి కష్టాలు గుర్తించాడు. కష్టపడి చదివి ఏపీ ఈసెట్‌లో రాష్ట్రస్థాయిలో పదో ర్యాంకు సాధించాడు. కొలువు సాధించి తల్లిదండ్రులకు ఆసరాగా నిలుస్తానని చెప్పారు.

IV
సాక్షి ఫ్యామిలీ
వైఎస్ఆర్ జిల్లా
శనివారం ॥ 17-5-2025



అడెలా స్ట్రాఫెకోవా: చెక్ రిపబ్లిక్

హైదరాబాద్ లో జరిగే 72వ మిస్ వరల్డ్ ఫెస్టివల్ లో చెక్ రిపబ్లిక్‌కు ప్రాతినిధ్యం వహిస్తుంది అడెలా స్ట్రాఫెకోవా. 21 ఏళ్ల ఈ బ్యూటీ మోడల్, ఫిట్నెస్ ట్రైనర్, ఈవెంట్ ఏజెన్సీ మేనేజింగ్ డైరెక్టర్‌గా కూడా పనిచేస్తోంది. కనెక్టింగ్ హార్ట్స్ అక్రాస్ జనరేషన్స్ పేరుతో రెండు, మూడు తరాల వారిని ఒకచోట చేర్చడం, ప్రేమ, దయ, స్నేహపూరిత వాతావరణాన్ని వ్యాప్తి చేయడంపై దృష్టి పెడుతుంది. 'ఏదైనా సాధించాలనుకోవడానికి ముందు తమకు నిజంగా ఏం కావాలో తెలుసుకోవడం ముఖ్యం' అంటూ తన గురించి తెలియజేసింది.

మనల్ని మనం తెలుసుకోవడమే..

‘‘అందాల కిరీటం అనేది ఒక ఏడాది వరకే. కానీ, చాలామందితో కనెక్ట్ అవ్వచ్చు. నా కల ఒక్కటే! మిస్ వరల్డ్‌గా నన్ను నేను చూసుకోవాలి. నా చిన్నప్పటి నుంచే ఈ ఆలోచన ఉండేది. మా అమ్మ మేకప్ వస్తువులన్నీ నేనే వాడేసేదాన్ని. అమ్మ డ్రెస్సులు, హీల్స్ వేసుకొని ఇంట్లో తిరిగేదాన్ని. పదిహేనేళ్ల వయసు నుంచి అందాల పోటీలలో పాల్గొంటూ వచ్చాను. పదిహేడేళ్ల వయసులో మొదటి సారి ప్రపంచ పోటీలో పాల్గొన్నాను.

> అందాల పోటీలలో పాల్గొనడమంటే అన్ని విధాల తమని తాము మానసికంగా, శారీరకంగా సంసిద్ధులను చేసుకోవడమే.

విజయసాధనకు..

బ్యూటీ కాంటెస్ట్‌లో చాలా ఛాలెంజెస్ ఉంటాయి. వివిధ రంగాలలో మమ్మల్ని పరీక్షిస్తారు. వాటిలో పాల్గొన్నప్పుడు కొంత ఆందోళనగా కూడా ఉంటుంది. కానీ, నన్ను నేను నిరూపించుకోవడానికి ముఖ్యమైన సమయం అదే. మిస్ బ్యూటీ కావాలని కలలు కనే యువతులు అనుకరించడం కాదు. ముందు తామేం కావాలని కోరుకుంటున్నారో తెలుసుకోవడం ముఖ్యం. నిజంగా ఏదైనా కోరుకుంటే 200 శాతం ప్రయత్నించాలి. అప్పుడే విజయం సాధించగలం. ఒక్క మిస్ విషయమే కాదు నేను ఏదైనా కోరుకున్నప్పుడు విజయం కోసం నా వంతుగా మొత్తం ప్రాణం పెట్టేస్తాను. అలాగే, విజయాలూ సాధించాను. కోరుకున్నది పొందాలంటే సరైన సమయం, శక్తి, దృష్టి పెడితే అదే మనకు అదృష్టంగా మారుతుంది. అందాల పోటీలలో పాల్గొనడమంటే అన్ని విధాల తమని తాము మానసికంగా, శారీరకంగా సంసిద్ధులను చేసుకోవడమే.

ఫిట్‌నెస్ ట్రైనర్

నాకు చిన్నప్పటి నుంచి క్రీడలంటే చాలా ఇష్టం. స్విమ్, రన్నింగ్, హార్స్ రైడింగ్ చేస్తాను. మోడలింగ్ నా కెరియర్. జీవనాధారం కూడా అదే. ఫిట్‌నెస్ ట్రైనర్‌గా కోచింగ్ ఇస్తాను. ఆ సమయంలో చాలా ఆనందిస్తాను. ఫిట్‌నెస్ గురించి నేను చెప్పే విషయాలు వినడమే కాదు, వాళ్లు ఆచరణలో పెడతారు. ఓ గొప్ప సమాజమే నాతో పాటు ఉందనిపిస్తుంది. వారితో నా అనుభవాలను పంచుకోవడం కూడా నాకు చాలా ఇష్టం. వారానికి కనీసం రెండుసార్లు ఫిట్‌నెస్ గ్రూప్‌లకు కోచ్‌గా పనిచేస్తాను.

నాకు ప్రస్తుతం ఉన్న క్షణం చాలా ముఖ్యమైనది. అందుకే ఈ క్షణంలో మాత్రమే జీవిస్తాను. సాధ్యమైనంత వరకు ప్రపంచాన్ని తెలుసుకోవాలి అనుకుంటాను.

ఫ్యాషన్ గురించి

ఒక వ్యక్తి తన వ్యక్తిత్వాన్ని తను ధరించే దుస్తుల ద్వారానే వ్యక్తపరచగలడు. మేం చెక్ రిపబ్లిక్‌లో స్థిరపడినా వివిధ దేశాలకు సంబంధించిన దుస్తుల్లో నన్ను నేను చూసుకుంటాను'' అని వివరించారీ బ్యూటీ.

– నిర్మలారెడ్డి

ఫొటోలు: ఎస్.ఎస్. ఠాకూర్

● సంకల్ప బలం

వెయిట్ లిఫ్టర్ బామ్మ @70

వరల్డ్ స్ట్రెంత్ గేమ్స్‌కి రెడీ

అరవై ఎనిమిది సంవత్సరాల వయసులో జిమ్‌లోకి అడుగు పెట్టిన రోషిణి... ఇప్పుడు ఎన్నో వ్యాయామాలలో ఆరి తేరింది. వెయిట్ లిఫ్టింగ్‌లో పట్టు సాధించింది. అమెరికాలో జరగబోయే 'వరల్డ్ స్ట్రెంత్ గేమ్స్'లో పాల్గొనడానికి రెడీ అవుతోంది 70 సంవత్సరాల రోషిణి.

కుమారుడితో కలిసి దిల్లీలో ఉంటున్న రోషిణికి ఎడమ కాలి మోకాలినొప్పి మొదలైంది. మెట్లు ఎక్కడం, నడవడం కష్టంగా మారింది. ఆమె ఎడమ మోకాలికి ఆస్టియో ఆర్థరైటిస్ ఉన్నట్లు గుర్తించారు. కుడి చూపుడు వేలు బలహీన పడింది.

ఫిజియో థెరపీ మొదలు పెట్టింది.

'ఈ టైమ్‌లో అమ్మకు జిమ్ అవసరం ఉంది' అనుకున్నాడు ఆమె కుమారుడు, ఫిట్‌నెస్ కోచ్ అయిన అజయ్.

68 సంవత్సరాల వయసులో తొలిసారిగా జిమ్‌లోకి అడుగు పెట్టింది రోషిణి.

మెల్ల మెల్లగా ఆమెకు సాంత్వన చేకూరింది.

స్ట్రెచ్చింగ్, మూమెంట్ ఎక్సర్‌సైజ్‌లతో మొదలుపెట్టి వర్కవుట్స్‌ను ఎంజాయ్ చేయడం మొదలుపెట్టింది. రెగ్యులర్ ట్రైనింగ్ వల్ల చేయి బలపడింది. రోజువారీ పనులు కష్టంగా అనిపించేవి కావు.

జిమ్ ఉత్సాహం ఆమెను వెయిట్ లిఫ్టింగ్ వైపు తీసుకువచ్చింది.

ఇప్పుడు రోషిణి ట్రాప్‌బార్ డెడ్‌లిఫ్ట్‌లో 97 కేజీల బరువు ఎత్తుతుంది.

80 కేజీల కన్వెన్షల్ డెడ్‌లిఫ్ట్స్ చేస్తుంది.

50 కేజీల స్క్వాట్స్ చేస్తుంది.

120 కేజీల లెగ్ ప్రెస్ చేస్తుంది.

4 నిమిషాల పాటు ప్లాంక్ పట్టుకోగలదు.

ప్రతిరోజూ రెండు గంటలు స్ట్రెంత్ ట్రైనింగ్, కార్డియో చేస్తుంది.

'దువ్వెన పట్టుకోవడం కూడా కష్టమే అని ఒకప్పుడు డాక్టర్లు అమ్మ గురించి చెప్పారు' అని గతాన్ని గుర్తు చేసుకున్నాడు అజయ్. జిమ్‌లో వర్కవుట్స్ పుణ్యమా అని ఇప్పుడు రోషిణికి ఇన్‌స్టాగ్రామ్‌లో వేలాదిమంది ఫాలోవర్స్ ఉన్నారు. వారు ఆమెను ప్రేమగా 'వెయిట్‌లిఫ్టర్ మమ్మీ' అని పిలుచుకుంటారు.

డైట్ విషయానికి వస్తే...

'ఎలాంటి రిస్ట్రిక్షన్‌లు లేవు. నాకు దహీ బల్లే అంటే చాలా ఇష్టం. అలా అని అదేపనిగా తినను. అప్పుడప్పుడు మాత్రమే తింటాను. ఏదైనా ఎక్కువ తీసుకోవడం మంచిది కాదు' అంటుంది ఇంటి భోజనాన్ని ఇష్టపడే రోషిణి.



● అజయ్, రోషిణి

వచ్చే సంవత్సరం అమెరికాలో జరిగే 'వరల్డ్ స్ట్రెంత్ గేమ్స్'కి ఆమెకు ఆహ్వానం అందింది.

ప్రస్తుతం రోషిణి ఆ ఈవెంట్ కోసం ప్రాక్టీస్ చేస్తోంది.

'ఒకప్పుడు నేను ఇంటికే పరిమితమయ్యేదాన్ని. ఇప్పుడు మాత్రం బయటికి వెళుతున్నాను. రకరకాల కార్యక్రమాలలో పాల్గొంటున్నాను. ఇప్పుడు సంతోషంగా ఉంది' అంటుంది రోషిణి.

'సీనియర్ సిటిజన్స్ జిమ్‌లో వ్యాయామాలు చేసినప్పుడు అది వాళ్లకు సంబంధించిన విషయం మాత్రమే కాదు. వారి నుంచి యువతరానికి సందేశం అందుతుంది' అంటున్నాడు అజయ్.



స్వేచ్ఛగా .. రెక్కలు విప్పేలా...

అమ్మాయిలకు చదువు కాదుకదా.. కనీసం వ్యక్తిగత శుభ్రత పాటించే వెసులుబాటు కూడా లేని చోట అందాల పోటీలంటే ఆనందంగా సాగనంపుతారా? పంపరు! అయోమ్ టీటో మతీజ్‌కు కూడా తీవ్ర నిరసన ఎదురైంది! అయినా వెనకడుగు వేయకుండా అందాల పోటీలకు అటెండ్ అయింది..

మిస్ సౌత్ సుడాన్‌గా కిరీటం ధరించి మిస్ వరల్డ్‌కి పోటీపడ్డానికి హైదరాబాద్ చేరుకుంది. తన దేశ పరిస్థితులు, వ్యక్తిగత వివరాలు, తన లక్ష్యం వగైరా ఆమె మాటల్లోనే...

‘‘లా చదివాను. లీగల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాను. సౌత్ సుడాన్‌లో పుట్టాను. కానీ అక్కడి రాజకీయ అనిశ్చితి వల్ల మా అమ్మ మమ్మల్ని తీసుకుని కెనడాకు వలస వచ్చేసింది. అందుకే నేను అక్కడే పెరిగాను. మా నాన్న, ఆయన తరఫు, అమ్మ తరఫు బంధువులంతా సౌత్ సుడాన్‌లోనే ఉండిపోయారు. మా అమ్మ కెనడాలో టీచర్‌గా ట్రెన్ అయ్యి, మా సొంత దేశంలోని పిల్లలకు మంచి స్కూల్‌ను ఏర్పాటు చేయడానికి తిరిగి సుడాన్ వచ్చేసింది. దాదాపు 20 ఏళ్ల తర్వాత 2019లో నేను మా కుటుంబాన్ని చూడ్డానికి నా సొంత దేశానికి వెళ్లాను. ఎమోషనలే కాదు.. కొంచెం షాక్ కూడా అయ్యాను. కెనడాలో నేను ఆస్వాదించిన జీవితం, సౌత్ సుడాన్‌లో మా వాళ్లంతా అనుభవిస్తున్న జీవితాన్ని బేరీజు వేసుకుని. అప్పుడే డిసైడ్ చేసుకున్నాను నా దేశ ప్రజలకూ ఉన్నత ప్రమాణాల జీవితం అందేలా కృషి చేయాలని! కోవిడ్ తర్వాత వచ్చేశాను. సర్వీస్ మొదలుపెట్టాను. నా బ్యూటీ విత్ పర్పస్ అదే!

అందాల పోటీలకు వ్యతిరేకం

అందాల పోటీల పట్ల సౌత్ సుడాన్‌లో చాలా వ్యతిరేకత ఉంది. నేను మిస్ సౌత్ సుడాన్ పాజెంట్‌లో పాల్గొంటున్నప్పుడు, ఇప్పుడు కూడా నిరసన ఎదురైంది. కానీ నా దృష్టిలో ఈ పోటీలు స్కిన్ షో కాదు. వైవిధ్యమైన సంస్కృతులు, భాషలు, జీవనశైలులను పరిశీలించే, అధ్యయనం చేసే అవకాశాన్నిచ్చే వేదిక. ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది. సర్దుబాటు, సహనాన్ని నేర్పిస్తుంది. ఇవన్నీ కూడా నా సామాజిక బాధ్యతను మెరుగ్గా నిర్వర్తించేందుకు తోడ్పడతాయి. అందుకే నిరసనను ఎదుర్కొని మరీ ఈ పోటీకి వచ్చాను. అంతేకాదు ఈ పోటీలు ఒకరినొకరు తెలుసుకుని, అర్థం చేసుకుని, ఒకరికొకరు సాయం అందించుకునే స్ఫూర్తినీ పంచుతాయి. మహిళలకు అలాంటి స్ఫూర్తి, ప్రేరణ అవసరం. దానికి అందాల పోటీలే కావాలా అంటారేమో! స్త్రీకి స్త్రీయే శత్రువు అనే నానుడి ప్రపంచ వ్యాప్తంగా పాతుకుపోయి.. అది స్త్రీల సహజ లక్షణమనే అభిప్రాయమూ అంతే లోతుగా నాటుకుపోయింది. దాన్ని అబద్ధమని నిరూపిస్తున్నాయి ఈ పోటీలు! కొన్ని దేశాల పేర్లే తెలియవు నేనీ కంటెస్ట్‌కి వచ్చేదాకా! అందుకే పట్టుబట్టి మరీ ఈ పోటీకి వచ్చాను. ఇక్కడి వైవిధ్యత, ఆధ్యాత్మికత నన్ను చాలా ఇన్‌స్పైర్ చేశాయి. ఈ దేశంలోని వాళ్లను చూస్తే నాకు ఫారినర్స్‌గా అనిపించరు. మా వాళ్లలాగే అనిపిస్తారు. ఎప్పుడో ఎక్కడో తప్పిపోయి.. ఇప్పుడు కలుసుకుంటున్నామేమో అనిపిస్తోంది! తెలంగాణ గురించి చెప్పుకోవాల్సి వస్తే ఇక్కడి ఎడ్యుకేషన్, మెడికల్ కేర్ గురించి కచ్చితంగా మాట్లాడుకోవాలి. ప్రపంచ ప్రమాణాలతో పోటీపడుతున్నాయి. సౌత్ సుడాన్ యువత తమ ఉన్నత చదువుల కోసం హైదరాబాద్‌కే వస్తోంది. మా దేశంలోని చాలామంది ప్రజలు ఆరోగ్య అవసరాల కోసం ఇక్కడి హాస్పిటల్స్‌నే ఆశ్రయిస్తున్నారు.

> మా దేశంలోని యంగ్ గర్ల్స్‌కి నేను మెంటర్‌గా ఉండాలి! వాళ్లు కలలను సాకారం చేసుకునేలా నేను తోడ్పడాలి. వాళ్ళకు రెక్కలున్నాయనే విషయాన్ని గ్రహించేలా చేయాలి.



అయోమ్ టీటో మతీజ్, మిస్ సౌత్ సుడాన్

బాల్య వివాహాలు.. బలవంతపు పెళ్లిళ్లు

ప్రపంచంలోని అనేక దేశాల్లాగే సౌత్ సుడాన్‌లోనూ పురుషాధిపత్యమే! కొడుకుకే ప్రాధాన్యం. అమ్మాయికి వ్యక్తిగత శుభ్రత విషయంలోనూ ఆర్థికపరమైన వెసులుబాటు ఉండదు. బాల్యవివాహాలు, బలంతపు పెళ్లిళ్లు కామన్. ఇక చదువుకునే అవకాశమెక్కడిది? నేను ఇక్కడిదాకా రాగలిగాను అంటే మా అమ్మే కారణం. మమ్మల్ని ఆమె కెనడా గనుక తీసుకు వెళ్లకపోయుంటే నా పరిస్థితి ఎలా ఉండేదో (ఈ మాట చెబుతున్నప్పుడు ఆమె కళ్లల్లో నీళ్లు). నాకింకా గుర్తు.. ఆమె లగేజ్ సర్దుతుంటే 'మనం ఎక్కడికి వెళ్తున్నాం?' అని అడిగాను. 'మీరు స్వేచ్ఛగా మీకు నచ్చింది చదువుకునే ఛాన్స్ ఉన్న చోటికి' అని చెప్పింది! మేం నలుగురు అక్కచెల్లెళ్లం. మాకొక తమ్ముడు. అందరినీ సింగిల్ పేరెంట్‌గానే పెంచింది అమ్మ. ఎలాంటి అవకాశాల కోసం అమ్మ మమ్మల్ని కెనడాకు తీసుకెళ్లిందో అలాంటి అవకాశాలనే సౌత్ సుడాన్‌లోని అమ్మాయిలకూ కల్పిస్తోంది తాను నడిపిస్తున్న స్కూల్ ద్వారా! ఆమె చేస్తున్న ఆ సర్వీస్‌కి నేనూ శాయశక్తుల సాయపడుతున్నాను. మా దేశంలోని యంగ్ గర్ల్స్‌కి నేను మెంటర్‌గా ఉండాలి! వాళ్ల కలలను సాకారం చేసుకునేలా నేను తోడ్పడాలి. వాళ్లకు రెక్కలున్నాయనే విషయాన్ని గ్రహించేలా చేయాలి. సాధికారతకు, సామాజిక బాధ్యతకు ఐకాన్స్‌గా ఉండి, తర్వాత తరాలను ఇన్‌స్పైర్ చేసేలా వాళ్లను తీర్చిదిద్దాలి. ఇదంత సులువైన జర్నీ కాదు. అయినా ప్రయత్నం వీడను!'' అంటూ తన జర్నీ గురించి చెప్పారు మిస్ సౌత్ సూడాన్.

– సరస్వతి రమ

ఫొటో: ఎస్.ఎస్. ఠాకూర్

ఎండాకాలం వచ్చిందంటే గృహిణులకు చేతినిండా పనే.
ఎండను డబ్బాల్లో దాచి పెట్టాల్సిందే...
అప్పడాలు, వడియాల పని పట్టాల్సిందే!
పప్పులో.. పులుసులో.. సాంబారులో.. రసంలో...
ఇలా దేనిలో నంచుకున్నా ఆ రుచి అదుర్స్.
అన్నింటినీ మించి అప్పడం ఒక్కటి ఉంటే చాలు...
విందు భోజనం చేసిన ఫీలింగ్ వచ్చేస్తుంది.
అయితే ఎప్పటిలా రొటీన్ రుచులు కాకుండా
కాస్త వెరైటీ అప్పడాలివి... ప్రయత్నించి చూస్తారా?

అప్పడాలతో అదిరే విందు

వంటిల్లు

సగ్గుబియ్యం అప్పడాలు



కావలసినవి: సగ్గుబియ్యం – ఒక కప్పు (కడిగి, సగ్గుబియ్యం రకాన్ని బట్టి, 3 గంటలు లేదా రాత్రి అంతా నానబెట్టుకోవాలి); నీరు – సరిపడా; ఉప్పు – తగినంత; జీలకర్ర – అర టీస్పూన్; నువ్వులు – ఒక టీ స్పూన్ (అభిరుచిని బట్టి); పచ్చిమిర్చి పేస్ట్ – ఒక టీస్పూన్ (అభిరుచిని బట్టి); నిమ్మ రసం – అర టీస్పూన్.

తయారీ: ముందుగా మందపాటి గిన్నెలో 4 కప్పుల నీరు పోసి మరిగించాలి. నీరు మరుగుతున్నప్పుడు, నానబెట్టిన సగ్గుబియ్యంలోని నీరు వంపేసి, మరిగే నీటిలో వేసుకోవాలి. కాసేపటికి ఉప్పు, జీలకర్ర, నువ్వులు, పచ్చిమిర్చి పేస్ట్ వేసుకుని బాగా కలుపుకోవాలి. మంటను మీడియంకు తగ్గించి, సగ్గుబియ్యం పూర్తిగా ఉడికే వరకూ అడుగంటకుండా, మధ్య మధ్యలో కలుపుతూ ఉండాలి. సగ్గుబియ్యం ఉడికిన తర్వాత, అది జిగురుగా మారుతుంది. ఒకవేళ మరీ గట్టిగా అనిపిస్తే కొద్దిగా నీరు కలపవచ్చు. చివరగా నిమ్మరసం కలిపి ఒకసారి కలుపుకొని స్టవ్ ఆఫ్ చేయాలి. ఈ మిశ్రమం కొద్దిగా చల్లారనివ్వాలి. మరీ పూర్తిగా చల్లారకుండా, గోరువెచ్చగా ఉండగానే, ఒక ప్లాస్టిక్ షీట్‌ను ఎండలో లేదా ఇంట్లోనే నేల మీద పరచుకుని, ఒక చిన్న స్పూన్ సహాయంతో కొద్ది కొద్దిగా సగ్గుబియ్యం మిశ్రమాన్ని గుండ్రంగా లేదా మీకు నచ్చిన ఆకారంలో అప్పడాల్లాగా వేసుకోవాలి. ఒకదానికొకటి కాస్తంత దూరం ఉంచాలి. వీటిని 2 లేదా 3 రోజుల పాటు ఎండలో బాగా ఆరనివ్వాలి. అప్పడాలు గట్టిగా తయారవ్వాలి. ఒకవైపు ఆరిన తర్వాత రెండోవైపుకు తిప్పి ఆరబెట్టాలి. అప్పడాలు పూర్తిగా ఆరిన తర్వాత, వాటిని ఒక ఎయిర్ టైట్ కంటైనర్‌లో నిల్వ చేసుకోవచ్చు. ఇవి చాలా కాలం నిల్వ ఉంటాయి.

మిరియాల అప్పడాలు



కావలసినవి: బియ్యం పిండి – ఒక కప్పు; మిరియాల పొడి – 2 టీస్పూన్లు; ఉప్పు – తగినంత; జీలకర్ర పొడి– అర టీస్పూన్; వంట సోడా – చిటికెడు; నీళ్లు – కొద్దిగా; నూనె – డీప్ ఫ్రైకి సరిపడా.

తయారీ: ఒక గిన్నెలో కప్పు నీళ్ల పోసి మరుగుతుండగా మిరియాల పొడి, ఉప్పు, జీలకర్ర పొడి, వంటసోడా వేయాలి. కాసేపు మరిగాక అందులో బియ్యం పిండి వేసి అడుగంటకుండా బాగా కలపాలి. స్టవ్ మీదినుంచి దించేసి కాస్త చల్లారాక అందులో రెండు స్పూన్ల నూనె వేసి మరోసారి కలిపి, చిన్న చిన్న ఉండలుగా చేసుకోవాలి. ఒక ప్లాస్టిక్ షీట్‌పై కొద్దిగా నూనె రాసి, ఒక్కో ఉండను పలుచని గుండ్రని అప్పడాల ఆకారంలో ఒత్తుకోవాలి. వీటిని ఎండలో ఒకటి లేదా రెండు రోజుల పాటు బాగా ఎండనివ్వాలి. బాగా ఎండిన తర్వాత వాటిని ఒక గాలి చొరబడని డబ్బాలో నిల్వ చేసుకోవచ్చు.

టమాటో అప్పడాలు





కావలసినవి: టమాటోలు – అరకేజీ; బియ్యం పిండి – రెండు కప్పులు; సగ్గుబియ్యం – కప్పు (నానబెట్టినవి); పచ్చిమిర్చి – 2 లేదా 3 (కట్ చేసి పేస్ట్‌లా చేసుకోవాలి); ఉప్పు – తగినంత; జీలకర్ర పొడి– టీస్పూన్; నూనె – డీప్ ఫ్రైకి సరిపడా

తయారీ: టమాటోలను బాగా కడిగి, కట్ చేసి, మెత్తగా, గుజ్జులా చేసుకోవాలి. ఒక గిన్నెలో బియ్యంపిండి, నానబెట్టిన సగ్గుబియ్యం, టమాటో గుజ్జు, తరిగిన పచ్చిమిర్చి పేస్ట్, ఉప్పు, జీలకర్ర పొడి వేసి బాగా కలపాలి. అవసరమైతే కొద్దిగా నీరు చేర్చి మెత్తని పిండిలా చేసుకోవాలి. ఈ పిండిని చిన్నచిన్న ఉండలుగా చేసుకోవాలి. ఒక ప్లాస్టిక్ షీట్‌పై కొద్దిగా నూనె రాసి, ఒక్కో ఉండను పలుచని అప్పడాల ఆకారంలో ఒత్తుకోవాలి. ఈ అప్పడాలను ఎండలో 2 లేదా 3 రోజుల పాటు బాగా ఆరనివ్వాలి. పూర్తిగా ఆరిన తర్వాత వాటిని నిల్వ చేసుకోవచ్చు.

కూల్ రూఫ్ టెక్నాలజీ



కూల్ సమ్మర్

పెరుగుతున్న వేడిని తట్టుకోవడానికి సామాన్యులు తక్కువ ఖర్చుతో కూడిన పద్ధతుల వైపు దృష్టి సారిస్తున్నారు. ఇందులో కూల్ రూఫ్స్ ప్రోగ్రామ్ ఒకటి. ఈ ప్రోగ్రామ్‌లో భాగంగా టైటానియం ఆక్సైడ్‌లాంటి మెటీరియల్‌తో తయారుచేసిన ప్రత్యేకమైన వైట్ పెయింట్‌ను రూఫ్ టాప్‌లకు వేస్తారు.

దీనికి ముందు రూఫ్‌ను చెత్త, మురికి లేకుండా శుభ్రపరుస్తారు. 'వైట్ పెయింట్ వల్ల ఏ మేరకు ఫలితం ఉంటుంది?' అనే విషయానికి వస్తే... ఉష్ణోగ్రతలలో చెప్పుకోదగ్గ తగ్గుదల కనిపిస్తుందని ప్రాథమిక పరీక్ష ఫలితాలు తెలియజేస్తున్నాయి. 'సోలార్ రెఫ్లెక్టివ్ వైట్ పెయింట్ నార్మల్ పెయింట్ కాదు' అంటుంది అహ్మదాబాద్‌లోని 'మహిళా హౌజింగ్ ట్రస్ట్' మేనేజర్ దీపిక వద్గామ.

'రూఫ్‌కు రెండుసార్లు పెయింట్ వేయడం మంచిది. మొదటి లేయర్‌కు, రెండో లేయర్‌కు మధ్య కనీసం రెండు గంటల విరామం ఉండాలి' అంటుంది దీపిక. 'అధిక వేడి వల్ల ఇబ్బంది పడకుండా హోమ్–బేస్ వర్కర్స్‌కు కూల్ రూఫ్ టెక్నాలజీ ఉపయోగపడుతుంది. వారు చేసే పనికి అంతరాయం ఏర్పడకుండా ఉంటుంది' అంటుంది దీపిక. అహ్మదాబాద్‌లోని లాల్ దర్వాజ బస్‌స్టాప్‌ను 'కూల్ బస్ స్టాప్'గా క్లైమేట్–ఫ్రెండ్లీగా డిజైన్ చేశారు.

'ఒకప్పుడు వేసవికాలంలో ఇంట్లో ఉండడం కష్టంగా ఉండేది. వేడి తట్టుకోలేక కుట్టుమిషన్ పని ఆపేయాల్సి వచ్చేది. సోలార్ రిఫ్లెక్టివ్ వైట్ పెయింట్ వల్ల ఇంట్లో వేడి బాగా తగ్గింది. ఇప్పుడు ఎలాంటి ఇబ్బంది లేకుండా పనిచేసుకోగలుగుతున్నాను. వచ్చే సంవత్సరం కూడా రూఫ్‌కు వైట్ పెయింట్ వేయిస్తాను' అంటుంది సంగీత బెన్ అనే గృహిణి.